కాదేది కథకనర్హం



బాల్య స్మృతుల్ని ఆధారంగా చేసుకునే రెండుమూడు పేజీల చిన్న కథల కథా మాలికలు ఇప్పుడు విరివిగా వస్తున్నాయి. మాండలికంలో రాయడం, పఠనీయత బాగా ఉండడం, కాస్తా స్థలంలో ఇమిడిపోవడం, యాంత్రికంగా తీరిక లేకపోతున్న ఈ కాలంలో దొరికే చిన్న విశ్రాంతి సమయంలో సులభంగా చదివేయగలగడం, సంక్లిష్ట తలేవీ లేని కథనం యీ కథా మాలికలకుండే మౌలిక లక్షణాలు. స్థలకాల నిర్దుష్టంగా ఉండే యీ కథా మాలికలు ఆయా ప్రాంతాల సంస్కృతినీ, చరిత్రనూ అలవోకగా రికార్డు చేస్తూ, చరిత్రకొక ప్రత్యామ్నాయంగా తయారవుతాయి. పసిపిల్లల అమాయకపు కళ్ళలోంచీ ఆవిష్కరించబడే యీ కథల్లోని ప్రపంచంలో పెద్దవాళ్ళు చెప్పనివీ, చెప్పలేనివీ అయిన విషయాలు సహజంగా దొర్లిపోయి, నాగరికత అని అందరూ అనుకుంటున్నదానిలోని కపట [హిపోక్రసీ] మేమిటో స్పష్టంగా వెల్లడై పోతుంది. రోహిణి వంజారి గారు రాసిన "విజయమహల్ సెంటర్ కథలు" అనే పుస్తకం కథామాలికలకొక కొత్త చేర్పుగా వెలువడుతోంది.

నెల్లూరు భూమికగా తయారైన యీ కథలు దాదాపు పాతికేళ్ల క్రితం ఒక

జిల్లాకు రాజధానిగా ఉండిన పట్టణంలోని జీవితాలెలాగుండేవో విప్పి చూపిస్తాయి. అన్ని రంగాల్లోనూ పెను మార్పుల్ని తీసుకువచ్చిన యీ పాతికేళ్ల కాలాన్ని మానవ చరిత్రలోనే పెద్ద ట్రాన్సిషనల్ కాలంగా గుర్తించి తీరాలి. పాత కాలానికి చెందిన పాఠకులకు ఈ కథలు జ్ఞాపకాల్ని రేకెత్తించి మురిపిస్తాయి. ఇప్పటి పాఠకులకీ విషయాల్ని వివరించి ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి.

బుజ్జి అనే ముద్దు పేరుండే ఆరేడేళ్ళ అమ్మాయికి తాను చెప్పే యీ కథలు తనకు తెలియకుండానే చాల పనులు చేస్తున్నాయని మాత్రం తెలియదు. చిత్తూరు జిల్లా పల్లెల్లో ఆడపిల్లల్ని "తిన మరిగి", "ఊరు మరిగి" అని రెండు రకాలుగా చూస్తారు. తిండి పైన్నే ధ్యాసుండే పిల్ల మొదటి రకమైతే, ఉండే చోటు ఉండకుండా ఊరంతా తిరిగొచ్చే పిల్ల రెండో రకం. యీ కథల్లోని బుజ్జిలో రెండు రకాల అమ్మాయీ ఉంది. అందరు పిల్లల్లాగే బజ్జీకి గూడా మాములు విషయాలు గూడా పెద్ద ఆశ్చర్యాలుగా కనబడతాయి. ఆపిల్ పండు, కుక్కపిల్ల, కుందేలు, కుడుములు, ఇలాంటి సాదాసీదా విషయాలు గూడా కథకనర్హం గాదని బుజ్జి నిరూపించి చూపిస్తుంది.

నెల్లూరులో ఉండే జనాల ఆచారాల్ని, వ్యవహారాల్ని మాత్రమే గాకుండా అక్కడ జరిగే తిరునాళ్ళూ, పొంగళ్ళూ, పూజలూ, మొక్కుబళ్ళూ, మొత్తంగా అక్కడ సంస్కృతినంతా తడిమిపారేస్తుంది. మనుషుల్లో ఉండే మంచిచెడ్డల తేడా ఆ పిల్లకు తెలియదు. మనుషులందరిపైనే వొకేరకమైన ఆపేక్ష తన కుందనే స్పృహ గూడా ఆ పిల్ల కుండదు. ఊర్లో ఉండే ధనవంతులకంటే కాయ కష్టం చేసే కూలీ జనాలతోనే తాను దగ్గరగా ఉంటున్నానని ఆ పిల్ల అనుకోదు. మనుషుల్ని అతలాకుతలం జేసే పెద్ద సంగతుల్ని తాను పట్టించుకోలేకపోతున్నానని బాధ పడదు. అనవసరంగా రంధ్రాన్వేషణ చేసి గొడవలు రగిలించడం లేదని గుర్తించదు. అందువల్లనే యీ కథా మాలికలు పాఠకుల్ని బాధ పెట్టవు. ఎక్కువగా నవ్వించడానికే ప్రయత్నిస్తాయి. లేకపోతే అయ్యో పాపం అనుకునేలా చేస్తాయి. మరీ కాకపోతే ఇదింతే గదా అని నిట్టూర్చేలా చేస్తాయి. తాను చెప్పే కథలన్నీ పాఠకుడు గుర్తు పెట్టుకోవాలని కూడా ఆ పిల్ల కోరుకోదు. వొక కథ పూర్తవుతూనే ఇంకో కథను మొదలుపెట్టి పూర్తిగా ఆ ప్రపంచంలోకి తీసుకుపోతుంది.

ఒకానొకప్పుడు కుటుంబాల్లో యెంత గాఢమైన మానవ సంబంధాలుండేవో యీ కథల్లో తెలిసి వస్తుంది. యెప్పుడూ అందుబాటులోనే ఉంటూ పిల్లల తోడే లోకమనుకునే తల్లిదండ్రులూ, సమయం దొరికినప్పుడల్లా ఆదుకోవడానికి సిద్ధంగా ఉండే వీధి స్నేహితులూ, ప్రతి పిల్లాడితోనూ వ్యక్తిగతంగా స్నేహాన్ని పెంచుకునే టీచర్లూ, నామ మాత్రపు ఫీజుతో కులీనాలీల్ని ఆదుకునే మానవత్వపు డాక్టర్లూ, కుటుంబికులతో స్నేహాన్ని పెంచుకునే రిక్షా వాళ్ళూ, పిల్ల కస్టమర్లతో ప్రేమగా ఉండే దుకాణాదార్లూ,

చివరకు తమ ఆటల్ని చూస్తున్న చిన్న ప్రేక్షకులతో ఆత్మీయులైపోయే దొమ్మరోళ్ళూ... ఇలా అందరూ కలసి జీవించిన వసుదైక కుటుంబమొకటి ఒకప్పుడుండేదని యీ కథలు జ్ఞాపకం చేసి హెచ్చరిస్తాయి.

చాలాకాలం క్రితమున్న జీవన ప్రమాణాలూ, ఆర్థిక పరిస్థితులూ, ఇప్పుడు తలచుకుంటే ఆశ్చర్యంలో ముంచెత్తేస్తాయి. కక్కసుల్ని కడిగే పాకీవాళ్ళు, నెల ఫీజుగా పావలా వసూలు చేసే స్కూళ్ళూ, చిరుతిళ్ళుతినడం కోసం అయిదు పైసలు కావాలని ప్రాథేయపడే పిల్లలూ, ఐదు రూపాయలకే గోళ్ళ రంగుల్ని అమ్మే అంగళ్ళూ, ఖాళీ సిగరెట్టు పెట్టెలతో ఆడుకునే కుర్రాళ్ళూ, ఇవన్నీ నిరుడు కురిసిన హిమ సమూహాలేన నుకుని నిట్టూర్చక తప్పదు.

నెల్లూరుకే ప్రత్యేకమైన సంగతులు చాల యీ కథల నిండా పరచుకుని ఉన్నాయి. కుడుముల స్వాములూ, రంగనాథ స్వామి గుడి రథోత్సవాలూ, దసరా మాయల పకీరు వేషాలతో బాటూ, సినిమా థియేటర్లను ముఖ్యమైన గమ్యాలుగా మార్చుకున్న జనాలు నెల్లూరులోనే ఎక్కువగా కనబడతారు. మదరాసుకు నూరు కిలోమీటర్ల దూరంలో ఉండే నెల్లూరును సినిమా వాళ్ళు తెలుగు జనాల నాడిగా యెప్పుడో గుర్తించారు. ఆ పాత కాలంలో కొత్త సినిమా విడుదలైనప్పుడంతా దాని భవిష్యత్తును తెలుసుకోవడం కోసం నిర్మాతలందరూ నెల్లూరుకొచ్చి థియేటర్లలో మోహరించే వాళ్ళని చరిత్ర చెప్తోంది. అందుకే యీ కథామాలికకు "విజయ మహల్ సెంటర్ కథలు" అని పిలవడం యాదృచ్ఛికమనిపించదు.

యీ కథా మాలికల్ని రాయడం ఏ రచయితకైనా తొలిదశలో చేసే సాధన మాత్రమే. ఇకపైన రోహిణి వంజారి గారు పరిపూర్ణమైన కథల్ని కూడా బాగా రాయగ లరని యీ చిన్ని కథలు బరోసా ఇస్తున్నాయి.

- మధురాంతకం నరేంద్ర

ప్రముఖ కథకులు, సాహితీవేత్త

కేంద్ర సాహితీ పురస్కార గ్రహీత.